జీలుగ సాగు.. దిగుబడి బాగు

- సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు
- పచ్చిరొట్ట ఎరువులతో పెరుగుతున్న భూసారం
- అందుబాటులో సబ్సిడీ జీలుగ విత్తనాలు


కొండపేటలో సాగు చేసిన జీలుగ పంట

ఎర్రవల్లి: మండల పరిధిలో అధికంగా వరిపంట సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. సుమారు 20 వేల ఎకరాల్లో పంట వేసేందుకు సాగు పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భూసారం పెంచడం, పంటను చీడపీడల బాధల నుంచి కాపాడటం, పెట్టుబడుల భారం నుంచి తప్పించుకొనేందుకు జీలుగ సాగుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయ అధికారులు కూడా సేంద్రియ పంటలపై అవగాహన కల్పించడం, పంట మార్పిడి వలన కలిగే ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో జీలుగసాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

20 వేల ఎకరాల్లో సాగు

మండల పరిధిలోని జూరాల కుడి కాల్వ పరిధిలో డీ–31 నుంచి డీ–38 కాల్వల ఆయకట్టు రైతులు సుమారు ఇరవై వేల ఎకరాలకు పైగే వరి పంట సాగు చేస్తుంటారు. పెట్టుబడిని తగ్గించేందుకు జీలుగను సాగు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

పంట మార్పిడితో ప్రయోజనాలెన్నో..

ప్రతిసారి పంటల మార్పిడిని తప్పకుండా చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. దీంతో రైతులు పంట వల్ల నష్టపోకుండా ఉండేందుకు గాను భూసారాన్ని పెంచి అధిక దిగుబడిని సాధించేందుకు జీలుగ సాగు ఎంతో దోహదం చేస్తుంది. మార్కెట్‌లో 30 కేజీల జీలుగ విత్తనాల ధర రూ.4,275 ఉండగా 50 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు రూ.2,137.50కు ప్రభుత్వం అందిస్తుంది. ప్రస్తుతం పంటల సాగు విధానంలో మార్పుల వల్ల ఏ గ్రామంలో ఏఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

జీలుగ సాగు విధానం..

వరి పంటను వేసే పొలంలో ఎకరాకు 25 కిలోల చొప్పున జీలుగ విత్తనాలను పది కిలోల యూరియాతో కలిపి వెదజల్లాలి. విత్తనాలను వెదజల్లిన తర్వాత ట్రాక్టర్‌తో తప్పకుండా దుక్కి దున్నాలి. వర్షాభావ పరిస్థితుల ఆధారంగా 30 నుంచి 40 రోజుల్లో జీలుగ పంట ఏపుగా ఎదిగి పూతదశకు చేరుకుంటుంది. పూత దశలోకి రాగానే జీలుగ పంటను ట్రాక్టర్ రోటవేటర్ లేదా కాడెద్దుల సహాయంతో భూమిలోకి కలియదున్నాలి. దున్నిన తర్వాత సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువును భూమిలో చల్లాలి. అనంతరం దుక్కికి నీళ్లు పారబెట్టడం వల్ల జీలుగ పంట పూర్తిగా కుళ్లిపోయి పచ్చిరొట్టె ఎరువుగా తయారవుతుంది.


పచ్చిరొట్టె ఎరువుల సాగుపై వ్యాస దీపికను పంపిణీ చేస్తున్న డీఏఓ(ఫైల్)

జీలుగ వల్ల కలిగే ఉపయోగాలు..

జీలుగ సాగు చేయడం వల్ల వరి పంటకు కావాల్సిన మూడు టన్నుల ఎరువు పచ్చిరొట్టెతో లభిస్తుంది. జీలుగ మొక్కలను భూమిలోకి కలియ దున్నడం వల్ల నత్రజని 27 శాతం, భాస్వరం 53 శాతం, పొటాషియం 22 శాతం, 2 శాతం జింక్, సూపర్ ఫాస్ఫేట్ అందుతుంది. వానపాముల ఉత్పత్తికి పచ్చిరొట్టె ఎరువులు దోహదం చేస్తాయి. జీలుగ వేర్లలో అధికంగా నత్రజని ఉండటం వల్ల తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను ఎదగకుండా ఇవి అడ్డుకుంటాయి.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు నేరుగా జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పుటాన్‌దొడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 80 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు జీలుగ విత్తనాల కోసం సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలి.

– రవికుమార్, మండల వ్యవసాయ అధికారి, ఇటిక్యాల

అవగాహన కల్పిస్తున్నాం



సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జీలుగతో పాటు జీవామృతం తయారీ విధానం, భూసారం పెంపుకోసం పాటించాల్సిన పద్ధతులు కూడా వివరిస్తున్నాం. సేంద్రియ ఎరువలు వాడకం, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి సాధించడానికి అధికారుల సూచనలు పాటించాలి.

– సక్రియనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, జోగుళాంబ గద్వాల

క్లుప్తంగా

‘ఉపాధి’ కూలి చెల్లించాలి

రాజోళి: ఉపాధి హామీ కూలీలకు వెంటనే కూలి డబ్బులు చెల్లించాలని సీపీఎం నాయకుడు విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు నెలలుగా కూలి డబ్బులు అందకపోవడంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వారం రోజులకొకసారి ఇవ్వాల్సిన కూలి, వారాల తరబడి ఇవ్వకపోతే వాటిపైనే ఆధారపడి జీవించే పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వారి కూలీలకు కూలి డబ్బులు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డు పొలం కౌలు వేలం



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామ శివారులోని వక్ఫ్ బోర్డుకు చెందిన పొలాన్ని ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు గురువారం తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు అధికారుల ఆధ్వర్యంలో మూడు సర్వే నంబర్లలోని పొలాన్ని వేలం వేయగా, 163 సర్వే నంబర్‌లోని 62.37 ఎకరాల భూమిని వేలంలో అబ్దుల్ ఖాదర్ అనే వ్యక్తి రూ.10 లక్షలకు దక్కించుకున్నారు. మిగిలిన రెండు సర్వే నంబర్లలోని పొలం వేలానికి రైతులు ఆసక్తి చూపలేదు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీరెడ్డి, ఆర్ఐ నాగరాజు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



గట్టు: యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ అన్నారు. గురువారం ఆలూరు, పెంచికలపాడు గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సీఈఓ భీంరెడ్డి, ఏఈఓ భార్గవి, సహకార సంఘం ఉద్యోగులు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి చెరువుల పరిశీలన



గట్టు: చేప పిల్లల పెంపకానికి సంబంధించి చెరువుల్లో కొత్తగా ఏర్పాటు చేసే చిన్నపాటి ఫిష్ పాండ్‌కు సంబంధించిన స్థలాలను గురువారం జిల్లా అధికారులు పరిశీలించారు. గట్టులోని పెద్ద చెరువు, రాయాపురంలోని చిన్నకుంట, శేషమ్మకుంట, ఆలూరు, వాయిల్‌కుంట తండాల్లోని చెరువులు పరిశీలించారు. నోటిఫైడ్ చెరువుల్లో ప్రభుత్వం చేప పిల్లల పెంపకానికి సంబంధించి చెరువుల్లోకి నీరు వచ్చే చోట కొత్తగా ఫిష్ పాండ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు డీటీసీ విద్యాధర్ తెలిపారు. ఫిష్ పాండ్‌ల్లోనే చేప పిల్లలను పెంచి, వాటిని ఆయా చెరువుల్లో వదిలేందుకు అనుకూలంగా నోటిఫైడ్ చెరువుల్లో కొత్తగా ఫిష్ పాండ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి డీటీసీ (జిల్లా టెక్నికల్ సెల్) అధికారి విద్యాధర్, ఈసీ రామకృష్ణ, ఐబీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యం, సుదర్శన్, రంగన్న పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

గద్వాల క్రైం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్ధప్ప హెచ్చరించారు. గురువారం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు, మైనర్లకు అబార్షన్ వంటి చర్యలకు పాల్పడితే పీసీఎన్‌డీటీ యాక్ట్– 1994 కింద చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దమయంతి, ప్రసూనారాణి, తన్వీర్ రిజ్వాన పాల్గొన్నారు.

డ్యాం రోడ్డు బాగుచేయండి సారూ..



రాజోళి: సుంకేసుల డ్యాంపై ఏర్పాటు చేసిన రోడ్డు బాగుచేసి రాకపోకలకు సులభతరం చేయాలని ఇరు రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారు. డ్యాం నుంచి రాజోళి వైపునకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. రక్షణ గోడలు లేకపోవడం, వర్షాల నేపథ్యంలో వాహనాలు అదుపుతప్పుతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కంటైనర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

మానవపాడు: జాతీయ రహదారి– 44పై కంటైనర్ బోల్తా పడిన సంఘటన గురువారం మండల కేంద్ర శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపుగా వెళ్తున్న కంటైనర్ మానవపాడు శివారులోని చిన్నవాగు వద్ద బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కానట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ చంద్రకాత్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందనట్లు పేర్కొన్నారు.

నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు బోధించాలి


అలంపూర్ చౌరస్తాలో శిక్షణ తరగతుల్లో రాష్ట్ర అబ్జర్వర్ విజయభాస్కర్

అలంపూర్: ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలని రాష్ట్ర అబ్జర్వర్ విజయభాస్కర్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు గురువారం మూడో రోజు కొనసాగాయి. శిక్షణ తరగతులకు నియోజకవర్గంలోని అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, రాజోళి, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాల్లోని స్కూల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. సబ్జెక్టుల వారీగా ఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో శిక్షణ తరగతులను రాష్ట్ర అబ్జర్వర్ సందర్శించారు. శిక్షణ తరగతుల వివరాలపై ఆరా తీశారు. శిక్షణలో ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు అందించిన అభ్యసాలు, పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోపడుతాయన్నారు. విద్యార్థులకు నూతన ఒరవడితో విద్యాబోధన చేయాలన్నారు. ఆసక్తిగా, అర్థమయ్యే విధంగా బోధన చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శివప్రసాద్, సెంటర్ ఇన్‌చార్జ్ హేమలత, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చేరేదెలా?


అయిజలో పశువుల ఆస్పత్రి వద్ద శిథిలమైన సీసీరోడ్డు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట మురికి కూపంగా మారిన రోడ్డు

అయిజ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీలోని తహసీల్దార్ కార్యాలయం, పశువుల ఆస్పత్రికి వెళ్లే రోడ్లు మోకాలు లోతు గుంతలు పడి అధ్వానంగా మారాయి. ప్రతిరోజు కార్యాలయాలకు వందల వందల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కనీసం కాలినడకన కూడా కార్యాలయాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. రోడ్డుపై వాహనాలు వెళ్తుంటే రోడ్డు పక్కన వెళ్లున్న వారిపై బురదనీరు చిమ్ముతోంది. వాహనాలు నడపాలంటే సర్కస్ చేసినట్లే ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లు అధ్వానంగా మారినాసరే అధికారులు, ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేటప్పుడు డైవర్షన్ రోడ్డు పట్టణం బయట నిర్మించడండతో చిన్న, పెద్ద వాహనాలు అంతర్గత రోడ్లపై ప్రయాణించడంతో రోడ్లు ధ్వంసమవుతున్నట్లు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

‘గ్రంథాలయం తెరిచే సమస్యే లేదు’

శాంతినగర్: గ్రంథాలయంలో విధుల నిర్వర్తించడానికి వచ్చినా.. తలుపు తెరవనని ఉద్యోగి చెప్పడం స్థానికంగా చర్చకు దారితీస్తోంది. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని తాత్కాలిక భవనంలో ప్రభుత్వ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా గ్రంథాలయం తెరవక పోవడంతో స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. స్థానిక మీడియా ప్రతినిధులు గురువారం గ్రంథాలయానికి వెళ్లి గ్రంథాలయ అధికారి కరుణాకర్‌ను వివరణ కోరగా గ్రంథాలయంలో మౌలిక వసతులు లేవని, పాఠకులకు ఇబ్బందికరంగా ఉందని కనీసం కరెంట్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. వారు స్పందించకపోవడంతో గ్రంథాలయాన్ని తెరవడంలేదని చెప్పడం గమనార్హం. మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో పాఠకులు కూడా రావడం లేదని, తెరిచినా మూసినా ఒకటే అని సమాధానం ఇవ్వడం సదరు అధికారికే చెల్లింది. అంతేగాక పార్ట్‌టైం స్వీపర్‌కు గ్రంథాలయ నిర్వాహకుడికి సమన్వయ లోపంతో పాఠకులకు ఇబ్బందులు కలుగజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై అధికారులు స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకొని గ్రంథాలయాన్ని వినియోగంలోకి తేవాలని పాఠకులు, విద్యార్థులు కోరుతున్నారు.


గ్రంథాలయం తలుపు మూసివేసిన ఉద్యోగి కరుణాకర్

జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులు



అయిజ: ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సబ్ జూనియర్ విభాగంలో ధర్మతేజ, ప్రణీత, శ్రీహరి, నందకిశోర్ క్యాడెట్ సిల్వర్ మెడల్ సాధించారు. అదే విధంగా భవాని శంకర్ కాంస్య పతకం సాధించగా యేమాంశ, ధనుష, హరీష్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించారు. వీరు ఈనెల 31, జూన్ 1న మేడ్చేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను తైక్వాండో మాస్టర్లు శ్రీహరి, షేక్షావలి, ఆచారి, సుధీర్, ప్రదీప్‌సాగర్, నవదీప్‌సాగర్, రాజశేఖర్ అభినందించారు.

ఊరి బడిని కాపాడుకోవాలి



ఎర్రవల్లి: తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి తమ పిల్లలను చేర్పించి ఊరి బడిని నిలబెట్టుకోవాలని ఎంఈఓ అమీర్‌పాషా అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌తో కలిసి గురువారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచడం కోసం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షుతులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం వంటి వసతులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ బడుల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. చదువు నాణ్యతలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఎలాంటి తేడా లేదని ఎన్నో సర్వేలు వెల్లడిస్తున్నాయన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువును అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రచార జాత కార్యక్రమం గ్రామాల వారీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాంబాబు, బీసన్న, రాజశేఖర్, తిమ్మప్ప, రాములు, మధునాయుడు, పెద్దయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డ్వాక్రా భవనం

మల్దకల్: మండలంలోని ఎల్కూరు గ్రామంలో నిర్మించిన డ్వాక్రా భవనం నిరుపయోగంగా ఉంది. 18 ఏళ్ల క్రితం రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన డ్వాక్రా భవనం చెరువు సమీపంలో ఉండటంతో మహిళలు, సిబ్బంది రావడానికే ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యకలాపాలు నిలిపేశారు. ఈ నేపథ్యంలో భవనం ముళ్లపొదలు, విష పురుగులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా డ్వాక్రా భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్వాక్రా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.


ఎల్కూరులో నిరుపయోగంగా ఉన్న డ్వాక్రా భవనం

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


మానవపాడులో విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు


ఎర్రవల్లిలో విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మానవపాడు: రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్, ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విత్తనాల షాపులు తనిఖీ చేశారు. రైతులకు నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినపుడు రశీదు తప్పనిసరిగా పొందాలన్నారు. పంటకాలం పూర్తి అయ్యేవరకు రశీదును భద్రపరుచుకోవాలని సూచించారు. మండలంలో విత్తనాల డీలర్లు దాదాపు 4,500 పత్తి విత్తన పాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, డీలర్లు, దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

రైతులకు రశీదులు ఇవ్వాలి..

ఎర్రవల్లి: విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని అలంపూర్ టాస్క్‌ఫోర్స్ ఏఓ నాగేశ్వరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు విత్తనాల దుకాణాలకు అలంపూర్ సర్కిల్ అధికారి రవిబాబుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కూడలిలోని శాంతి సీడ్స్, ఎస్‌కేఎస్ ట్రేడర్స్, అన్నదాత, మన గ్రోమోర్, మన రైతు బజార్ తదితర దుకాణాలు తనిఖీ చేసి పలు రకాల విత్తన పాకెట్లు, స్టాకు రికార్డులు, కంపెనీ బిల్లులు, తయారీ, ముగింపు తేదీతో పాటు లాట్ నంబర్లను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మార్పీల కంటే అధిక ధరలకు విక్రయించరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రశీదులు భద్రపరచుకోవాలి

గట్టు: రైతులు ఎరువులు, విత్తన దుకాణాల్లో కొనుగోలు చేసిన వాటి రశీదులు పంటకాలం పూర్తయ్యే వరకు భద్ర పరుచుకొవాలని ఏడీఏ సంగీతలక్ష్మి అన్నారు. గురువారం మాచర్ల గ్రామంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ చేశారు. రైతులకు తగినన్ని ఎరువులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఇదే క్రమంలో ఎరువుల నిల్వ వివరాలు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓపై రైతులు అవగాహన పెంచుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి

అయిజ: కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీఓ యోజన కింద రైతుల ఆదాయం పెంచే ఉద్దేశంతో ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కార్యక్రమాన్ని ప్రారంభించిందని, రైతులు దానిపై అవగాహన కలిగి ఉండాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలోఎఫ్‌పీఓ సిబ్బంది రైతులకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. వ్యవసాయం, అనుబంధ రంగాల ఉత్పత్తిని పెంచే విధంగా రైతులను సంఘాలుగా చేసి, వారికి ఆర్థిక సహాయం చేసేందుకు ఏర్పాటు చేసినదే ఎఫ్‌పీఓ అన్నారు. స్వతహాగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్స్ మొదలైనవి సరఫరా చేయడంతోపాటు టిల్లర్, స్ప్రింక్లర్ సెట్, హార్వెస్టర్ వంటి వ్యవసాయ యంత్రాలను అద్దెకు ఇవ్వడం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, రవాణా వంటి లాజిస్టిక్స్ సేవలను అందించడం వంటి వ్యాపారాలు చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 600 సంఘాలు, దేశ వ్యాప్తంగా 10 వేల సంఘాలు ఏర్పడినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని, సీఎస్ఏ (సెంట్రల్ సస్టైనబుల్ అగ్రికల్చర్) పిలుపునిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీఈఓ వినీత్, సభ్యులు వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణ, కళ్యాణ్, నరసింహులు, వెంకటేష్, రఘు, భీమేష్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

పొలం బాట ఘర్షణలో గాయాలు

అయిజ: పొలం బాట విషయంలో బుధవారం మేడికొండ గ్రామానికి చెందిన రాఘవేంద్రగౌడ్, గోపిగౌడ్ ఘర్షణకు దిగారు. ఘర్షణలో గోపిగౌడ్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తగాదా విషయపై గోపిగౌడ్ సోదరుడు తిరుమలేష్‌గౌడ్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జాం


పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద టోల్ కౌంటర్లు మూసేసిన సిబ్బంది

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు టోల్‌గేట్ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గురువారం పుల్లూరు టోల్‌గేట్ వద్ద సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తడంతో 12 టోల్ కౌంటర్లలో 6 కౌంటర్లను సిబ్బంది మూసేశారు. రెండు గంటలపాటు సాఫ్ట్‌వేర్ పనిచేయకపోవడంతో కర్నూలు, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడినట్లు వాహనదారులు వాపోయారు.


భారీగా నిలిచిన వాహనాలు